క్లుప్తంగా

సోమేశ్వరాలయంలో రాకింగ్ రాకేశ్



పాలకుర్తి టౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రం సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి జబర్దస్త్ ఫేమ్, కేసీఆర్ సినిమా హీరో రాకింగ్ రాకేశ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు.

రవీందర్‌కు సన్మానం



చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన అక్కినేపల్లి రవీందర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో నెల్లుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇటీవల పద్య నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా రవీందర్ ఎంపిక కాగా నెల్లుట్ల ఫౌండేషన్ లక్ష్మారావు–అనసూయమ్మల కళాపీఠం ఆధ్వర్యంలో నెల్లుట్ల రవీందర్‌రావు–లక్ష్మి దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో వంగ వెంకటేశ్వర్లు, శ్రీరామోజు శ్రీనివాస్, భీమగాని చంద్రయ్య, గాడిపల్లి రామస్వామి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



జనగామ రూరల్: పట్టణంలోని సుశీలమ్మ వృద్ధాశ్రమంలో ఆదివారం కోస్తా గ్రూప్ సంస్థ హోమ్ అధ్యక్షుడు తాల్క లక్ష్మణ్ అధ్యక్షతన వయోవృద్ధులకు చీరలు, అన్నదాన వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోస్తా సీనియర్ అసిస్టెంట్ విక్రముద్దీన్ ఆహార అలవాట్ల గురించి వివరించారు. ఎలాంటి వత్తిడి లేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రతీ రోజు వ్యాయమం చేయాలని సూచించారు. శ్రీధర్, అంబటి రాజయ్య, ఆర్గనైజర్ నర్సాగౌడ్, మహేందర్, కావేరి కోఆర్డినేటర్ యాసిన్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకునేందుకే సమ్మేళనం



చిల్పూరు: జీడి వంశంలో పేదరికంతో చదువుకు దూరమైన విద్యార్థులను గుర్తించి ఆదుకోవడమే నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి జీడి వంశస్తుల ఆత్మీయ సమ్మేనం ఉద్దేశమని మల్లేషం, భిక్షం అన్నారు. మండలంలోని పల్లగుట్టలో ఆదివారం జీడివ ఆనందం అధ్యక్షతన జీడి వంశస్తుల ఆత్మీయ సమ్మేళనం, ముఖ్యుల మొదటి సదస్సు నిర్వహించారు. సమావేశ నిర్వహణలో పీహెచ్‌డీ జీడి రమేశ్, జీడి జాన్, జీడి పెద్ద రమేశ్ కృషి అభినందనీయమన్నారు. సమ్మేళనంలో 200 కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



జనగామ రూరల్: పట్టణలంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ప్రధాన మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు వీక్షించారు. ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, రైతులు, మహిళలకు ఉపయోగపడే ఎన్నో విషయాలను తెలుసుకోవచ్చన్నారు. పట్టణ అధ్యక్షుడు అనిల్, పెద్దోజు జగదీశ్, నాయకులు చంద్రం, చందు, ప్రసాద్, నరేశ్ పాల్గొన్నారు

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

నర్మెట: సనాతన ధర్మాన్ని కాపాడి ఆచరించాల్సిన బాధ్యత ప్రతీ హిందువుపై ఉందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు దేవేంద్ర, పంచాక్షరి, రామరాజు అన్నారు. ఇంటింటికి ఇందూ జ్ఞాన ధర్మప్రచారంలో భాగంగా మండలంలోని వెల్దండలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచనలు, త్రైత సిద్ధాంత, భగవద్గీతలను ఆదివారం పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. శివరామకృష్ణ, లక్ష్మీనారాయణ, శంకర్, యాదగిరి, మాధవి, శాంతి కుమారి, సూరజ్, శాంతికుమార్, సుకన్య, లత, జయమ్మ, ధనలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు..

- సాక్షి ఆధ్వర్యంలో స్పెల్ బీ, మ్యాథ్స్ బీ నిర్వహణ



తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షను పరిశీలిస్తున్న కళాశాల డైరెక్టర్ తాళ్ల చైతన్య

కాజీపేట: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో స్పెల్ బీ, మ్యాథ్స్ బీ జిల్లా స్థాయి పరీక్షను సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ఆదివారం నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో విజయం సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పోటాపోటీగా తలపడి ప్రతిభాపాటవాలను పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వరంగల్ సాక్షి బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్, గణితంపై పట్టు వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రెజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమండ్రి వారు వ్యవహరిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి పోటీ పరీక్షలో పాల్గొనాలనుకుంటే 94424 50551 నంబర్ ద్వారా సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్ గుప్తా, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, తాళ్ల పద్మావతి డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, ప్రిన్సిపాల్ అఫ్‌జాల, దోమ మహేందర్ రెడ్డి, సౌమ్యతో పాటు సాక్షి బృందం సభ్యులు పాల్గొన్నారు. ఈపోటీ పరీక్షలో పాలుపంచుకున్న విద్యార్థుల మనోగతాన్ని వారి మాటల్లో..

SAKSHI SPELL Bee 2024-25
SAKSHI MATH BEE 2024-25

సాక్షికి ధన్యవాదాలు



స్పెల్‌బీ, మాథ్స్ బీ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడుతాయి. వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పరీక్షలు చాలా ఉపయోగపడతాయి. ఈ పరీక్షలు మా కళాశాలలో నిర్వహించే అవకాశం కల్పించిన సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు.

– తాళ్ల చైతన్య డైరెక్టర్, తాళ్లపద్మావతి కళాశాల

మ్యాథ్స్‌పై పట్టు వచ్చింది



పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల మాలాంటి విద్యార్థులకు గణితంపై భయం పోయి మంచి పట్టు వస్తుంది. ఇది మాకు భవిష్యత్తులో చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

– అక్షయ్యశ్రీ, 9వ తరగతి, ఏకశిల హైస్కూల్, జనగామ

ప్రతీ అంశంపై పట్టు లభిస్తుంది



సాక్షి మ్యాథ్ బీ పరీక్షలో పాల్గొనడం వల్ల కొత్త విషయాలను తెలుసుకున్నాను. ప్రతి అంశం మీద పట్టు లభించడంతో, భవిష్యత్తులో పోటీ పరీక్షలకు మ్యాథ్ బీ ఎంతగానో దోహదపడుతుంది.

– సీహెచ్.పల్లవి, 9వ తరగతి, ఒయాసిస్ హైస్కూల్, స్టేషన్ ఘన్‌పూర్

సాక్షి మ్యాథ్ బీతో విజ్ఞానం పెరుగుతుంది



సాక్షి మ్యాథ్ బీ పరీక్షలతో విజ్ఞానం పెరుగుతుంది. పోటీ పరీక్షల్లో ఎలా పాల్గొనాలనే విషయం హైస్కూల్ స్థాయిలోనే అవగాహన కలుగుతుంది. ఇలాంటి పరీక్షలు మరిన్ని సాక్షి నిర్వహించాలి.

– ఎం.సౌమ్య, కేజీబీవీ, జనగామ

హిందూ చైతన్య రథయాత్రకు స్వాగతం

జనగామ: ధర్మజాగరణ హిందూ చైతన్య రథయాత్రలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీకి చేరుకున్న యాత్రకు ప్రజలు, అయ్యప్ప స్వాములు, కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మీనాగరాజు ఆధ్వర్యంలో మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ధర్మజాగరణ రాష్ట్ర సమితి సభ్యులు ఆనందేశి దయానంద మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ, హిందువులను మరింత చైతన్యం చేయడంతోపాటు ఐక్యతే లక్ష్యంగా ఈ యాత్ర సాగుతుందన్నారు. జిల్లా సంయోజక్ జీవిలికపల్లి సత్యనారాయణ, పాత్కనూరి లక్ష్మీనారాయణ, జగదీశ్‌రావు, సోమేశ్వర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

గిర్నిగడ్డలో..

హిందూ చైతన్య రథయాత్రను జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత ధర్మ జాగరణ సమితి పరియోజన ప్రముఖ్ దయానంద్ జీ మాట్లాడారు. కార్యక్రమంలో సమితి జిల్లా ప్రతినిధిలు సత్యనారాయణ, జగదీశ్వర్, ఆలయ సభ్యులు రాములు, సంతోశ్, మహిళలు ఉన్నారు.



గిర్నిగడ్డలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో యాత్రను ప్రారంభిస్తున్న భక్తులు

మహిళను ఇంట్లో ఉంచి తాళాలు వేసి..

రఘునాథపల్లి: ఇంట్లో పూజ చేస్తుండగా కొందరు వ్యక్తులు బయటి నుంచి రెండు దర్వాజల తలుపులకు తాళం వేశారని ఓ మహిళ రఘునాథపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని కోమళ్ల గ్రామానికి చెందిన పేరబోయిన భాగ్యలక్ష్మి ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో పూజ చేస్తోంది. ఆమె భర్త రాజు ఇంట్లో లేడు. ఈ సమయంలో దాయాదులు ఇంటికి ఉన్న రెండు దర్వాజల తలుపులకు తాళాలు వేశారు. కిటికిలో నుంచి చూసిన భాగ్యలక్ష్మి తలుపులు తెరవాలని కోరినా వారు పట్టించుకోకుండా వెళ్లిపోయారు. కేకలు వేసినా ఎవరూ లేకపోవడంతో ఆమె 100కు ఫోన్ చేసింది. దీంతో గ్రామానికి వెళ్లిన పోలీసులు తాళాలు వేసిన వారిని మందలించి తలుపులు తెరిచారు. అనంతరం బాధితురాలు భాగ్యలక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురిపై ఫిర్యాదు చేసింది. దాయాదుల మధ్య ఆస్తి తగాదాల నేపథ్యంలో ఇంటికి తాళాలు వేశారని చెబుతున్నారు. ఈ విషయమై ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా ఇంటికి తాళాలు వేసిన విషయం నిజమేనని, ఇరువర్గాల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



తాళం వేసిన ఇంటిలో ఉన్న భాగ్యలక్ష్మి

డేటా ఎంట్రీ పరిశీలన

నర్మెట: మండల విద్యావనరుల కేంద్రంలో ఆదివారం సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని ప్రారంభించగా ఎంపీడీఓ అరవింద్ చౌదరి, తహసీల్దార్ రామానుజాచార్యులు, ఎంఈఓ ఐలయ్య, ఎమ్మార్ఐ సింగారపు సాయిబాబు, కార్యదర్శి కందకట్ల శ్రీధర్, ఎంట్రీ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

చెరువులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

- ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్

జనగామ రూరల్: గ్రామాల్లో ప్రతి చెరువులను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. ఆదివారం మండలం గోపరాజుపల్లిలో కెనాల్ కాల్వ తెగిపోవడంతో స్పందించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచన మేరకు రైతులతో కలిసి పార్టీ ఆధ్వర్యంలో సందర్శించినట్లు తెలిపారు. కాల్వ తెగిపోయి పంట పొలాల నుంచి నీరు ప్రవహిస్తున్న రైతులతో మాట్లాడి చెరువులకు నీరు అందించేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, నాయకులు బడికె కృష్ణ స్వామి, తోటపల్లి రాజిరెడ్డి, గోపరాజు పల్లి, ఓబుల్ కేశ్వాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కొమురయ్య, జనార్దన్ రెడ్డి, నాయకులు కొమరయ్య, మల్లయ్య, ప్రకాశ్ యాదవ్, కరుణాకర్, అరవింద్, బాబు పాల్గొన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న శివరాజ్ తదితరులు

సన్మానం

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్‌ను యాదవ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పాలకుర్తి పట్టణ కుల(పెద్దగొల్ల) సలేంద్ర సోమన్న, సిద్దిరాజు, కృష్ణమూర్తి, వెంకన్న, భిక్షపతి, యాకయ్య, యుగేందర్, కృష్ణ, ప్రకాశ్ యాదవ్ పాల్గొన్నారు.

రూ.2 కోట్ల ప్రొసిడింగ్స్ అందజేసిన కడియం

రఘునాథపల్లి: మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులకు ఎస్డీసీఎల్, ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా మంజూరైన దాదాపు రూ.2 కోట్ల ప్రొసిడింగ్స్‌ను అందజేశారు, మండలంలోని కుర్చపల్లి సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలు, రఘునాథపల్లి మహిళా సంఘం భవనానికి రూ.10 లక్షలు, ఇబ్రహీంపూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, ఫతేషాపూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, కోడూర్ కురుమ సంఘం భవనానికి రూ.3.75 లక్షలు, అశ్వరావుపల్లి మహిళా సంఘం భవనానికి రూ.5 లక్షల ప్రొసిడింగ్స్ అందజేశారు, కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు శివకుమార్, నరేందర్, భాస్కర్‌రెడ్డి, లింగాజీ, శ్రీనివాస్, నాగరాజు, ఎల్లస్వామి, కుమార్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రొసిడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు నిధులు

జఫర్‌గఢ్: మండలంలోని కోనాయిచలం, రఘునాథ్‌పల్లి గ్రామాలలో గౌడ, ముదిరాజ్, ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిధులు మంజూరు చేస్తూ ఆయా ప్రొసిడెంగ్ కాపీలను స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం అందజేశారు. రఘునాథపల్లిలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షలు, కోనాయిచలంలో ఎస్సీ కమ్యూనిటీహాల్‌కు రూ.10 లక్షలు మంజూరు చేశారు. వీటితోపాటు జఫర్‌గఢ్ మండల కేంద్రానికి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.8లక్షల 70 వేల నిధులను మంజూరు చేస్తూ ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, గడ్డం కుమారస్వామి, మట్టపల్లి బుచ్చయ్య పాల్గొన్నారు.

తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన కొంతం లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండలోని తన నివాసంలో రూ.2.50 లక్షల ఎల్ఓసీని బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వప్న ప్రభాకర్, మాజీ సర్పంచ్ పద్మ అశోక్, యాదగిరి, అజయ్, నాగేశ్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో వేల్పుగొండ లక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణమహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ కల్యాణమహోత్సవాన్ని భక్తులు కనులార తిలకించి భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. సాయంత్రం సమయంలో గరుడ వాహనంపై స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు వెంకటాచార్యులు, శ్రీనివాసచార్యులు, కృష్ణమచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

సరస్వతీమాత ఆలయంలో ఆర్యవైశ్యుల వనభోజనాలు

చిల్పూరు: మండలంలోని తీగలతండా–రాయగూడెం పంచాయతీ పరిధిలోని సరస్వతీమాత ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్యులు ఆలయ నిర్మాణ దాత రామగిరి సోమలింగం ఆధ్వర్యంలో వన భోజనాల కార్యక్రమం నిర్వహించుకున్నారు. ముందుగా నిత్యాన్న ఏర్పాటు దాత దొడ్డ ఈశ్వరయ్య–రాజేశ్వరి దంపతుల సమక్షంలో ఆర్యవైశ్యులు సరస్వతీ దేవి, శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ నిర్మాణ దాత సోమలింగం మాట్లాడారు. వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, లింగమూర్తి, లవన్‌కుమార్, రాజమౌళి, పురుషోత్తం, రాజేందర్, కరంచంద్, వరప్రసాద్–మౌనిక తదితరులు ఉన్నారు.



శివాలయంలో ప్రత్యేక పూజల్లో ఆర్యవైశ్యులు

ఆర్థిక సాయం.. పరామర్శలు



జనగామ: ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు



బచ్చన్నపేట: సాయం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

జనగామ/రఘునాథపల్లి: రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంకు చెందిన సహచర మిత్రుడు గంపల పరశురాములు ఇటీవల హత్యకు గురి కాగా, 1999–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.40వేల సాయం అందించారు. స్వామిరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మధు, రఘురాం, భిక్షపతి, ఎల్లేష్, రాంచందర్, నరేష్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, స్వామిరెడ్డి, రఘు, లక్ష్మణ్, కర్ణాకర్ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

చిల్పూరు: లింగంపల్లికి చెందిన పురుమాని సాంబరాజు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2 అందజేశారు.

బచ్చన్నపేట: తమ్మడపల్లిలో మృతి చెందిన దొమ్మాట లచ్చవ్వ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం రూ. 4వేల అందించారు. రేణుక, కుమార్, కాశీ, పలువురు పాల్గొన్నారు.

తరిగొప్పుల: బొంతగట్టునాగారం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ సుంకరి కనకయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా.. బాధిత కుటుంబసభ్యులను తహసీల్దార్ నాగేశ్వరచారి పరామర్శించారు. జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ ఉన్నారు. ఇదిలా ఉండగా.. అక్కరాజుపల్లికి చెందిన అందె నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. బాధిత కుటుంసభ్యులను నవ యువత యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మిండ్లాపురం కర్ణాకర్ ఆదివారం పరామర్శించి రూ.3,000 అందజేశారు. సంపత్, హరీశ్, వెంకటేశ్, ఉదయ్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: 12వ వార్డుకు చెందిన కనకం గట్టయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఇల్లందుల రాజనారాయణ ఆధ్వర్యంలో 50కిలోల బియ్యాన్ని ఆదివారం అందించారు. దయాకర్, రమేశ్, తిరుపతి, రత్నాకర్, ఆరోగ్యం, ప్రణయ్, కిట్టు, అభిలాష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలి

రఘునాథపల్లి: కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దైతల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వమే ధాన్యం కొనుగోళ్లు చేస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగంగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు గుర్రం జంపి, కెంగర్ల శ్రీను పాల్గొన్నారు.

జనసభను విజయవంతం చేయండి

పాలకుర్తి టౌన్: డిసెంబర్ 6న వరంగల్ నగరంలో జరిగే జనసభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆదివారం జనసభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. జనసభకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, రైతులు, మేథావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు జీడి సోమయ్య, కొనకటి కళింగరాజు, గాయల బాబు, సారయ్య, రాజు, దాసరి ఉప్పలయ్య, బండిపెల్లి అంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు మూలమలుపు వద్ద శ్రమదానం

జఫర్‌గఢ్: మండల కేంద్రమైన జఫర్‌గఢ్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో తిమ్మంపేట గ్రామ శివారు వద్ద మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్లను కోనాయిచలం గ్రామానికి చెందిన రాగి ఎల్లారెడ్డి తన యంత్రంతో ఆదివారం తొలిగించారు. ఇదే మూలమలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి రహదారి మూసుకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న రాగి ఎల్లారెడ్డి స్వచ్ఛందంగా తన యంత్రం ద్వారా చెట్లను తొలిగించి శుభ్రం చేశారు. దీంతో వాహనదారులు, స్థానికులు ఎల్లారెడ్డిని అభినందించారు. ఇటీవల పాఠశాలలో కూడా ఎల్లారెడ్డి తన యంత్రం ద్వారా చెట్లను తొలిగించి ఉపాధ్యాయులు, విద్యార్థుల ద్వారా అభినందనలు పొందారు.

ఆదివాసీలకు దుస్తులు, సామగ్రి పంపిణీ



కొడకండ్ల: ములుగు, భద్రాద్రి కొత్తగూడెం అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీలకు మండలకేంద్రానికి చెందిన ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుస్తులు, వస్తుసామగ్రి పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్దపూడి ప్రసన్నకుమార్ తెలిపారు. కార్యక్రమంలో పాలుపంచుకొన్న వలంటీర్లు, సహకరించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఆదివారం కళాజాతా నిర్వహించారు. ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్రలో భాగంగా మండలంలోని కొడవటూర్, బండనాగారం, నాగిరెడ్డిపల్లిలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ప్రజలకు పాటలు. నాటికల రూపంలో అర్థం అయ్యేలా వివరించారు. కార్యక్రమంలో టీం లీడర్ పిన్నింటి రత్నం, అధ్యక్షుడు గట్టమల్ల సంజీవ, కళాకారులు కేమిడి కనకరాజు, గణేశ్, పన్నీరు శ్రీనివాస్, స్వప్న, పద్మ, రంజాన్, చామంతి, మమత పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలను విస్మరించిన కాంగ్రెస్

చిల్పూరు: ఆరుగ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్ అన్నారు. మండలంలోని నష్కల్‌లో ఆదివారం పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుపై పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు వెంకటరమణ, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తోట శ్రీనివాస్, వెలిశాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు

పాలకుర్తి టౌన్: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రమేశ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా..

- ఎర్రబెల్లి దయాకర్‌రావు



లక్ష్మీనర్సమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న దయాకర్‌రావు

కొడకండ్ల: ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మైదంచెరువు తండాలో భాను, పెద్దబాయితండాలో సత్తమ్మ, చెరువుముందు తండాలో స్కూల్ బస్సు కింద పడి మృతి చెందిన శ్రీహన్, రామవరంలో తండా సోమయ్య, సత్యనారాయణ, శిరీష, కొడకండ్లలో లక్ష్మీనర్సమ్మ మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను దయాకర్‌రావు పరామర్శించారు. సింగె రామోజీ, పేరం రాము, సోమరాములు, జ్యోతి, వెంకటేశ్వర్‌రావు, అభిమన్‌గాంధీ, సతీశ్‌గౌడ్, మంగ్యా నాయక్, ప్రేమ్‌కుమార్, రాజిరెడ్డి, కనకయ్య, రణధీర్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎడ్ల రవి భార్య హరిత అకాల మరణం ఆ కుటుంబానికి తీరనిలోటని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని నీర్మాలలో హరిత మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. పల్లె సుందర్‌రామిరెడ్డి, పీఏసీఏస్ డైరెక్టర్ కొత్త జలంధర్‌రెడ్డి, కాడబోయిన ఐలయ్య, చింత రవి, సోమసుందర్, నర్సిరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పంట మార్పిడితోనే భూమి సారవంతం

- రైతు నేస్తం కేశిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

చిల్పూరు: పంటల మార్పిడితోనే భూమి సారవంతం అవుతుందని ఈవిషయాన్ని రైతులు గమనించాలని మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతు నేస్తం కేశిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రమణ అధ్యక్షతన హనుమకొండలో ఆదివారం సేంద్రియ కార్బనాన్ని భూమిలో పెంచడం ఎలా అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రైతు నేస్తం రాజేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. భూమిలో ఉన్న సేంద్రియ కార్బనాన్ని కాపాడాలంటే వరికొయ్యలు కాల్చొద్దని, పంట మార్పిడి తప్పనిసరని రైతులకు సూచించారు.